

సాక్షి
పల్నాడు

బుధవారం। 9। అక్టోబర్। 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,523 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 30,221 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 588.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,040 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు



కర్లపాలెం: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో ఆరో రోజైన మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

మహాలక్ష్మీదేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో మంగళవారం బాలచాముండేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో ఆరో రోజు మహాలక్ష్మీదేవిగా భక్తుల పూజలందుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కోదండరామాలయంలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.

23న భూమి పూజా మహోత్సవం నిర్వహించండి

నరసరావుపేట: ఈనెల 23వ తేదీన నిర్వహించే గ్రామసభలలో మంజూరైన పనులకు సంబంధించి భూమి పూజా మహోత్సవాలను ప్రారంభించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. జిల్లా పంచాయతీ అధికారి కేవీ భాస్కరరెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం–గుంటూరు తరలింపు



బాపట్లటౌన్/కాకుమాను: రోడ్డు ప్రమాదంలో 12 మందికి గాయాలైన సంఘటన మండలంలోని జమ్ములపాలెం సమీపంలో చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరు గ్రామానికి చెందిన 15 మంది మంగళవారం కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలోని పోలేరమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం సూర్యలంక సముద్రస్నానం చేసేందుకు బయల్దేరారు. మార్గంమధ్యలో రేటూరు–జమ్ములపాలెం మధ్యలో జిల్లెళ్లమూడి సమీపంలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. వాహనంలో ప్రయాణిస్తున్న నాగేంద్రం, లక్ష్మీపార్వతి, అన్నపూర్ణ, నాగేశ్వరరావు, ఎం.లక్ష్మి, వి.రాఘవ, వి.వెంకటేశ్వరమ్మ, వి.తిరుపతిస్వామి, వి.పల్లవి, వి.సౌజన్య, ఎం.మనస్విని, ఎం.సుప్రియలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు బాధితులను 108 వాహనంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎం.లక్ష్మి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. మిగిలిన క్షతగాత్రులంతా బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. రూరల్ సీఐ గంగాధరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వివరించారు. మంగళవారం విజయవాడ నుంచి రాష్ట్రంలోని సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించే ప్రక్రియపై జిల్లా కలెక్టర్లతో మంత్రి రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 16 నుంచి నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ మొదలు అవుతుందని, షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే రోజువారి కార్యక్రమాలు అమలుచేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు పకడ్బందీగా కార్యాచరణను తయారుచేసి నివేదించాలని ఆదేశించారు. నీటి పారుదల అధికారులు పాల్గొన్నారు.



కృష్ణమ్మకు హారతులు ఇస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) మహాలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మ

శ్రీపీఠే..సురపూజితే!

- శ్రీమహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ
- ఇంద్రకీలాద్రిపై వైభవంగా దసరా ఉత్సవాలు
- నేడు సరస్వతీదేవిగా అమ్మవారికి విశేష అలంకరణ
- అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు శక్తుల్లో ఒక శక్తి మహాలక్ష్మీదేవి. లోక స్థితికారిణిగా ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్మిలుగా వరాలు ప్రసాదించే అష్టలక్ష్మి సమిష్టి రూపమైన శ్రీమహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ మంగళవారం భక్తులను కరుణించారు. తెల్లవారుజాము నాలుగు గంటలకు అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించిన అనంతరం నిత్య పూజలు చేశారు. ఆలయ ఈఓ, పోలీసు, రెవెన్యూ అధికారులు తొలి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

రూ.500 టికెట్లపై భక్తుల ఆగ్రహం

రూ.500 టికెట్ల విక్రయంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.500 క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి మూడు నుంచి నాలుగు గంటలు పడితే రూ.300, రూ.100తోపాటు సర్వ దర్శనం గంటలోనే పూర్తవుతోందని తెలంగాణ నుంచి విచ్చేసిన భక్తులు పేర్కొన్నారు.

దుర్గమ్మ సేవలో డీజీపీ

శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారిని డీజీపీ ద్వారకా తిరుమలరావు దంపతులు దర్శించుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఈఓ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు సీఎం పర్యటన నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్ల గురించి సీపీ రాజశేఖర్‌బాబును డీజీపీ అడిగి తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు.



ఆరో రోజు రూ.57.18 లక్షల ఆదాయం

దసరా ఉత్సవాల్లో ఆరోజైన మంగళవారం దేవస్థానానికి రూ.57.18 లక్షల ఆదాయం లభించింది.

కాణిపాకం దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మకు కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం దేవస్థానం ఈఓ పట్టెం గురుప్రసాద్, అర్చకులు ఇంద్రకీలాద్రికి చేరుకోగా దుర్గగుడి అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు, డీఈఓ రత్నరాజు, ఆలయ అర్చకులకు పట్టు వస్త్రాలు, పూజా సామగ్రిని అందజేశారు. దుర్గగుడి తరఫున ఈఓ రామరావు అమ్మవారి ప్రసాదాలను కాణిపాకం దేవస్థాన అధికారులకు అందజేశారు. అన్నవరంలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న కాణిపాకం ఆలయ అధికారులు, అర్చకులు

అన్నవరం ఆలయం నుంచి..

అన్నవరం ఆలయ ఈఓ రామచంద్రమోహన్ దంపతులు, ఆలయ అధికారులు, అర్చకులు ఇంద్రకీలాద్రికి విచ్చేసి దుర్గగుడి అధికారులకు పట్టు వస్త్రాలు అందజేశారు.

నేడు మూలా నక్షత్రం

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. అత్యంత కీలకమైన అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం దుర్గమ్మను శ్రీ సరస్వతీదేవిగా అలంకరిస్తారు. అమ్మవారిని సరస్వతీదేవిగా దర్శించుకుని విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని ప్రసాదించాలని వేడుకునేందుకు అశేష భక్తజన కోటి మంగళవారం రాత్రి 11 గంటల నుంచే ఇంద్రకీలాద్రికి తరలివచ్చింది. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై రాత్రి నుంచి భక్తులను కంపార్టుమెంట్‌లోకి మళ్లించారు. బుధవారం తెల్లవారుజాము రెండు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమైంది.



మూలా నక్షత్రం దర్శనం కోసం మంగళవారం అర్ధరాత్రి రోడ్డుపై వేచి ఉన్న భక్తులు

నిజమైన దోషులను అరెస్టు చేయండి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ద్విచక్రవాహన ర్యాలీ
- జేసీకి వినతిపత్రం అందజేత

నరసరావుపేట: చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో ముస్లిం మైనార్టీ కుటుంబానికి చెందిన ఏడేళ్ల చిన్నారి అశ్వియ అంజుమ్‌ను హత్య చేసిన అసలైన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంఐఎం నాయకులతో కలిసి కలెక్టరేట్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కలిసి వినతిపత్రం సమర్పించారు. గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వంలో చిన్నారులపై హత్యలు, అత్యాచారాలు జరగడం నిత్యకృత్యంగా మారాయన్నారు. ఇది బాధాకరమైన విషయమని అన్నారు. చిన్నారుల మీద అత్యాచారాలు, హత్యలు చేస్తున్న వారి మీద వెంటనే తగిన చర్యలు చేపట్టాలని, వారిపై కఠినంగా శిక్షలు అమలు చేయాలని సూచించారు. ఈ విధంగా చేస్తేనే ఇటువంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా ఉంటాయని అన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయట్లేదు

రేషన్ షాపుల్లో కందిపప్పు, బియ్యం, పంచదార సక్రమంగా ఇవ్వట్లేదని, చాలా షాపుల్లో ఇంకా పంపిణీ మొదలు పెట్టనేలేదని, కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులు మాత్రమే ఇస్తామని చెప్పి వారిచేత బలవంతంగా రేషన్ డీలర్లు వేలిముద్రలు వేయించుకుంటున్నారని, ఈ విషయాన్ని కూడా జేసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజలందరికీ నిత్యావసర వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పింఛన్ల తొలగింపు బాధాకరం

అనేక గ్రామాల్లో పింఛన్లు తొలగిస్తున్నారని, మరి కొంతమంది పింఛన్లు వేరే మండలాలకు బదిలీ చేస్తున్నారని చెప్పారు. రొంపిచర్లకు చెందిన ఐదుగురి పింఛన్లు రాజుపాలెం మండలానికి బదిలీ చేశారని చెప్పారు. వృద్ధులు ఆ మండలానికి వెళ్లి ఏ విధంగా పింఛన్ తెచ్చుకోగలరని ప్రశ్నించారు. సొంత గ్రామంలోనే పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

బ్యాంకు డిపాజిట్‌దార్లకు న్యాయం చేయండి

ఐసీఐసీఐ బ్యాంకు చిలకలూరిపేటశాఖలో సుమారు రూ.40కోట్లు నరసరావుపేట శాఖలో రూ.10కోట్లు గల్లంతైనట్లు వార్తలు వస్తున్నాయని, కారకులైన ఉద్యోగస్తులపై వెంటనే చర్యలు తీసుకొని వారిని అరెస్ట్ చేయాలని, డిపాజిట్‌దారులకు తక్షణమే వారు డిపాజిట్ చేసిన డబ్బులు తిరిగి అందజేయాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి డిమాండ్ చేశారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు అమాంతం పెంచేశారని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారన్నారు. ఎంఐఎం నాయకులు షేక్ కరీముల్లా, షేక్ మౌలాలి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ ఖాజావలి మాస్టర్, ఎస్సీ, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ రెహమాన్, షేక్ మస్తాన్‌వలి, మాగులూరి రమణారెడ్డి, గంటెనపాటి గాబ్రియల్, మొగిలి ఆంజనేయులు, షేక్ కరీముల్లా, షేక్ ఖాదర్ బాషా, అచ్చి శివకోటి, సయ్యద్ సిలార్ బాషా, తిప్పరయ్య, షేక్ ఖాజా, షేక్ జాఫర్, సయ్యద్ ఖాదర్ బాషా, వరవకట్ట బుజ్జి, కోట చిన్నబాబు, భూదాల కళ్యాణ్, బొగ్గరం మూర్తి, శివరాత్రి అశోక్‌కుమార్,, కాకుమాను కోటిరెడ్డి పాల్గొన్నారు.



ధనలక్ష్మి

నకరికల్లు మండలం నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి అమ్మవారిని మంగళవారం రూ.మూడు కోట్ల కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. అర్చకులు పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. రూ.50, రూ.100, రూ.200, రూ.500 కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

–నకరికల్లు

వరికి మూషికాల బెడద

- పంటలను తీవ్రంగా దెబ్బతీస్తున్న ఎలుకలు
- పిలకలు, చిరుపొట్ట దశలో ఉన్న వరి పైరు
- జిల్లా వ్యాప్తంగా 34,396 హెక్టార్లలో సాగవుతున్న వరిపైరు
- ఇప్పటివరకూ ప్రారంభం కాని ఎలుకల నివారణ చర్యలు



బెల్లంకొండ మండలంలో సాగులో ఉన్న వరిపైరు

బెల్లంకొండ: తుఫాన్ ప్రభావంతో కొంతమేర పత్తి పంటను నష్టపోయిన రైతులు వరి పంటపై ఆశలు పెట్టుకున్నారు. పత్తి పంట మిగిల్చిన నష్టాన్ని కొంత మేర అయిన వరిలో పూడ్చుకోవాలని ఆశలతో సాగు చేపట్టారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఒక వైపు తెగుళ్ల, మరోవైపు ఎలుకల బెడద రైతులకు నిద్ర లేకుండా చేస్తోంది. మూషికాలు అన్నదాతలను ముప్పతిప్పలు పెడుతున్నాయి. పిలకలు, చిరు పొట్ట దశలో ఉన్న వరి పైరును కొరికేసి అపారంగా నష్టపరుస్తున్నాయి. దుబ్బు దశలో తీపిగా ఉన్న పిలకలను కొరికేస్తూ పైరుకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. దీంతో ఎలుకల కలిగించే నష్టం దిగుబడిపై ప్రభావం చూపుతుంది. ఎలుకలను నిర్మూలించుకునే చర్యలు చేపట్టకపోతే వాటి తీవ్రతను బట్టి పంటలో 10 నుంచి 40 శాతం దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 34,396 హెక్టార్లలో సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పల్నాడు జిల్లాలోని 28 మండలాలలో 34,396 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు వరి పైరును సాగు చేస్తున్నారు. సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో 2,290 హెక్టార్లు, క్రోసూరు సబ్ డివిజన్‌లో 4,762 హెక్టార్లు, నరసరావుపేటలో 4,898 హెక్టార్లు, వినుకొండలో 4886 హెక్టార్లు, పిడుగురాళ్లలో 10,756 హెక్టార్లు, మాచర్ల డివిజన్‌లో 6,804 హెక్టార్లలో వరి సాగవుతుంది.

ప్రారంభం కానీ సామూహిక నిర్మూలన చర్యలు

వరి పైరును ఎలుకల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన పద్ధతులను అనుసరించాలి. రైతులు తమ పొలానికి పరిమితమైన ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా ప్రయోజనం ఉండదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు ఎలుకల నివారణకు ప్రతి ఏడాదీ రైతులతో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలను చేపడతారు. వ్యవసాయ శాఖ నూరు శాతం రాయితీపై ఎలుకల నిర్మూలనకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు అందిస్తుంది. అదేవిధంగా స్థానికంగా రైతు భరోసా కేంద్రాలలో రైతులతోనే ఎలుకల నివారణ మందు మిశ్రమాన్ని తయారు చేయించడం వంటి కార్యక్రమాలు చేయిస్తారు. కానీ ఆ దిశగా ఇంతవరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టలేదని రైతులు చెప్తున్నారు. త్వరితగతిన ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేపట్టాలని కోరుతున్నారు.

నివారణకు ఏం చేయాలంటే...

గ్రామంలోని రైతులంతా కలసి ఒక యూనిట్‌గా ఏర్పడి సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి. ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ రెండు శాతం మందును ఉపయోగించి సత్ఫలితాలు పొందవచ్చు.

- విషపు ఎరగా తయారు చేసుకోవడం కోసం 96 శాతం నూకలు, రెండు గ్రాముల నూనె, మరో రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందును మిశ్రమంగా కలుపుకోవాలి.
- విషపు ఎలా తయారుచేసే సమయంలో చేతులకు గ్లౌజులు లేదా పాలిథిన్ సంచి తొడుక్కోవాలి. లేదంటే మందులో ఉండే మనిషి చేతివాసనను ఎలుక పసిగట్టి ఎరను స్వీకరించదు.
- తయారుచేసిన మిశ్రమాన్ని 10 గ్రాములు చొప్పున పేపర్లో పొట్లాలుగా కలిపి ఉంచుకోవాలి.
- మొదటిరోజు పొలంలో ఉన్న బొరియలను గుర్తించి మట్టితో కప్పి వేయాలి.
- రెండో రోజు తెరచి ఉన్న బోరీలను ఎలుకలు ఉన్న బొరియలుగా నిర్ధారించుకుని, విషపు ఎరలను బొరియల్లో వేసి మూసివేయాలి.
- పదవరోజు తెరుచుకున్న బోరెలను గుర్తించి మళ్లీ విషపు ఎర వాడాలి. ఈ విధంగా చేయడం వలన ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుంది.

ఎలుకల నివారణ మందు పంపిణీ చేయాలి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రెండు ఎకరాలలో వరిపైరు సాగు చేస్తున్నా. తుఫాన్ ప్రభావం వల్ల పైరు నీట మునిగినప్పటికీ, వెంటనే నివారణ చర్యలు చేపట్టడంతో పైరు నష్టపోలేదు. కానీ ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండడంతో ఎలుకలు దుబ్బులను కొరికేస్తూ తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. ప్రతి ఏడాదీ వరినాట్లు వేసిన 40 రోజులకే వ్యవసాయ శాఖ అధికారులు ఎలుకల నివారణ మందు అందించేవారు. కానీ పంట వేసి 50 రోజులు దాటుతున్నా ఇప్పటి వరకూ రాయితీపై మందును అందించలేదు.

– చిట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ మండలం

మందు పంపిణీకి చర్యలు చేపట్టాం



వరి పైరులో సామూహిక ఎలుకల నిర్మూలనపై స్థానిక వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు అందజేస్తున్నారు. వంద శాతం రాయితీపై రైతులకు ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును అందించేందుకు అన్నీ మండలాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాం. ప్రతి రైతుకూ మందు పంపిణీ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాం. ఈ వారంలో తప్పనిసరిగా అన్నీ గ్రామాలలో రైతులకు అందిస్తాం.

– ఐ.మురళి, జిల్లా వ్యవసాయాధికారి, పల్నాడు జిల్లా

పైరుపై ఎలుకల దాడి

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఆగస్టు నెల చివరికల్లా వరి నాట్లు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల సెప్టెంబర్ మొదటి వారంలో పూర్తిచేశారు. ప్రస్తుతం పైరు వేగంగా దుబ్బు కడుతూ కొన్నిచోట్ల పిలకదశలో, మరి కొన్ని చోట్ల చిరు పొట్ట దశలో ఉంది. పొట్టకు వచ్చిన పిలకలు తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి, బొరియల్లోకి తీసుకెళుతున్నాయి. దుబ్బులను కత్తిరించేసి పైరును ఎలుకలు చిందరవందర చేస్తున్నాయి. పొట్ట దశలో ఉన్న దుబ్బులను పాడు చేస్తుండడంతో వరి కంకులు రాలిపోతున్నాయి.



వరి పొలంలో దుబ్బులను కొరికేస్తున్న ఎలుక

క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న అంతరిక్ష వారోత్సవాలు



నరసరావుపేట రూరల్: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇస్రో ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నారు. సైన్స్ ఫెయిర్, క్విజ్, డ్రాయింగ్ పోటీలు, వీడియో ప్రోగ్రామ్‌ల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాలలోని ఎస్‌ఈసీ, ఈసీఈ బ్లాక్‌ల్లో ఏర్పాటుచేసిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాన్ని షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.గ్రహదురై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలాం స్వస్థలమైన రామేశ్వరానికి చెందిన తాను, తన చేతుల మీదగా విగ్రహావిష్కరణ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గెస్ట్ లెక్చర్‌లో పాల్గొన్నారు. చంద్రయాన్–1,2, 3లో ఇస్రో బృందం ఎదుర్కున్న సమస్యలను అధ్యాపకులు, విద్యార్థులకు తెలియజేశారు. వాతావరణ పరిస్థితులు, వాటి పరిష్కారాలను వారు ఎలా అధికమించారో వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా అభిషేక మహోత్సవం



నెహ్రూనగర్: గుంటూరు మేత్రాసన పీఠాధిపతిగా బిషప్ రెవ.డాక్టర్ చిన్న బత్తిన భాగ్యయ్య 8 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంపాలెంలోని పునీత అంథోని పుణ్యక్షేత్రంలో నూతన గురునిలయాన్ని మంగళవారం ప్రారంభించారు. భాగ్యయ్య మాట్లాడుతూ ఈ పుణ్యక్షేత్రంలో ఏసుక్రీస్తు అద్భుత కార్యాలు చేశారని చెప్పారు. ఏసుక్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని చెప్పారు. పుణ్యక్షేత్ర విద్యుత్తు దీపాలంకరణకు సంఘ కమిటీ సభ్యుడు నేలపాటి జ్ఞాన ప్రకాశరావు రూ. లక్ష విరాళం అందజేశారు. ముందుగా భాగ్యయ్యకు అభిషేక మహోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర విచారణ గురువు ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు, విజయవాడ మేత్రాసన పీఠాధిపతి రాజారావు, విచారణ గురువులు అంథోని బాల, మద్దు బాల, డాక్టర్ దాసరి కిరణ్, మఠ కన్యలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జ్వరపీడితులు



ఈ చిత్రంలోని బాలుడి పేరు అజయ్. వారం రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నాడు. జ్వరం కారణంగా ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నాడు. ప్లేట్‌లెట్లు తగ్గడంతో బాలుడిని ఇన్ పేషెంట్‌గా చేర్చుకొని మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

- పెరుగుతున్న జ్వర పీడితులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



జనరల్ మెడిసిన్ విభాగంలో చికిత్స కోసం బారులు తీరిన రోగులు

చిలకలూరిపేట: జ్వరాలు చిలకలూరిపేట ప్రాంతాన్ని భయపెడుతున్నాయి. వాడవాడలా జ్వరపీడితులు దర్శనమిస్తున్నారు. సామాన్యులు జ్వరాల బారిన పడి భయభ్రాంతులకు గురి అవుతున్నారు. పట్టణంలోని 100 పడకల ఏరియా ప్రభుత్వ వైద్యశాల పాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పీహెచ్‌సీలకు జ్వరపీడితులు క్యూ కడుతున్నారు. ఇక ప్రైవేటు వైద్యశాలలు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఇటీవలి వాతావరణ పరిస్థితులు, లోపించిన పారిశుద్ధ్యం కారణంగానే జనం జ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం వైరల్, టైఫాయిడ్ జ్వరాల తీవ్రత అధికంగా ఉండగా, వీటితో పాటు డెంగీ కేసులు కూడా నమోదౌతున్నాయి. గత కొన్నేళ్ల కిందట పట్టణంలోని వడ్డెర కాలనీలో కలుషిత నీటితో 50 మంది కామెర్ల వ్యాధి బారిన పడ్డారు. సుమారు ఐదేళ్ల కిందట పట్టణంలోని సుభానీ నగర్, వైఎస్సార్ కాలనీ, పురుషోత్తమ పట్నంలలోనూ, నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో డెంగీ వ్యాధి లక్షణాలతో 11 మంది మృత్యువాత పడ్డారు. వాననీటితో పాటు మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఒక్క పట్టణ పరిధిలోనే 48 మురికివాడలు ఉండగా, వీటిలో దాదాపుగా ప్రతిచోట ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు, కంప పెరిగి ఉంటాయి. ముఖ్యంగా దాసరి కాలనీ, హెచ్‌హెచ్ డైక్‌మెన్ కాలనీ, రజకకాలనీ, మోమిన్ బజార్, రూత్ డైక్‌మెన్ కాలనీ, మారుతినగర్, మద్దినగర్, ఎన్టీఆర్ కాలనీ, ఆది ఆంధ్రా కాలనీ, వైఎస్సార్ కాలనీ, వీరముష్టి కాలనీ, భావనా ఋషినగర్ తదితర కాలనీలలో ఖాళీ ప్రదేశాలలో కంపచెట్లు పెరిగి వాటినిండా వర్షపు, మురుగునీళ్లు చేరి నిలవ ఉంటాయి. నివాస ప్రాంతాల మధ్య ఖాళీ ప్రదేశాలలో పెరిగిన ఈ కంపచెట్ల మూలంగా దోమలు పెరగటం, అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడుతుంటాయి.

అల్లాడుతున్న జనం

జ్వరాలతో పేదలు అల్లాడిపోతున్నారు. కుటుంబంలో ఎవరో ఒకరికి జ్వరం వస్తే రోజువారి కూలీ డబ్బులు పోయి, వేలాది రూపాయలు అప్పులు మిగులుతాయి. వాస్తవంగా వైద్య వర్గాలు సూచిస్తున్న ప్రకారం డెంగీ జ్వరం సోకిన వారికి జ్వరం, తీవ్ర తలనొప్పితో పాటు నీరసం, ఒళ్లు నొప్పులు వస్తాయి.

ఈ లక్షణాలకు తోడు విరోచనం నల్లగా, మూత్రం ఎర్రగా వస్తూ ఒంటిమీద ఎర్రటి మచ్చలు ఏర్పడినప్పుడు వ్యాధి తీవ్రంగా ఉన్నట్లు పరిగణించాల్సి ఉంటుందని వైద్యులు తెలుపుతున్నారు. ఎలీసా టెస్ట్ పరీక్షల ద్వారానే ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. స్థానిక వైద్యులు ఎక్కువ మంది అనుమానితులను గుంటూరు రిఫర్ చేస్తున్నారు. అక్కడ వేలాది రూపాయలు పరీక్షలు, ప్లేట్లెట్ల పేరున వసూలు చేయటంతో సామాన్యులు జ్వరం వస్తేనే వణికిపోతున్నారు.

నీరసంగా ఉంటోంది



మూడు రోజులుగా జ్వరంగా ఉంది. దీంతో నన్ను ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. జ్వరం కారణంగా ఏమీ తినలేక పోతున్నా. తల నొప్పి, నీరసంగా ఉంటోంది. మూడు రోజులుగా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నా.

– షేక్ అఫ్సా, బాధితురాలు

టైఫాయిడ్‌తో ఇబ్బంది పడ్డా



నాకు, నా భార్యకు టైఫాయిడ్ జ్వరం సోకి వారం రోజుల పాటు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నాం. విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పితో బాధపడ్డాం. జ్వరాల తీవ్రత దృష్ట్యా పారిశుద్ధ్య మెరుగుతో పాటు, ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

–షేక్ సుభాని, బాధితుడు

జాగ్రత్తలు పాటించాలి



ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. నిల్వ ఉన్న నీటిపై కిరోసిన్, మడ్డి ఆయిల్ వంటివి పోయాలి. తాగి పడవేసిన కొబ్బరి బోండాలు, రోకళ్లు, కూలర్లు, పాత టైర్లు వంటివాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

–డాక్టర్ లక్ష్మీకుమారి, సూపరింటెండెంట్, ఏరియా ప్రభుత్వ వైద్యశాల

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు

గురజాల రూరల్: అధైర్యపడవద్దు ....పార్టీ మీకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక సబ్ జైలులో మాచవరం మండలం తురకపాలెం గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నాయకులు అక్రమ కేసులు బనాయించి సబ్ జైల్‌కు తరలించారు. కార్యకర్తలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే కాసు పరామర్శించారు. అనంతరం సబ్‌జైల్ బయట మాట్లాడుతూ టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యే కాసుతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, జడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, కొమ్మినేని బుజ్జి,వేముల చలమయ్య, కలకండ అంద్రెయ, కె గిరిబాబు, మన్నెం ప్రసాద్, వి అమరారెడ్డి, డికే తదితరులున్నారు.

హోంగార్డులు అభినందనీయులు

- మృతి చెందిన ఇరువురి కుటుంబ సభ్యులకు రూ.10లక్షల చెక్కులు పంపిణీ
- ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగికి రూ.5 లక్షల చెక్కు
- జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసిన ఎస్పీ శ్రీనివాసరావు



మృతిచెందిన హోంగార్డు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: అనారోగ్యంతో మృతిచెందిన, బాధపడుతున్న సహోద్యోగుల కుటుంబాలకు సహాయం చేసేందుకు తమ ఒక్కరోజు వేతనాన్ని అందించిన హోంగార్డులు అభినందనీయులని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కొంతకాలంగా పూజారిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు శివ కామేశ్వరరావుకి రూ.5లక్షలు, నరసరావుపేట ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు మల్లికార్జునరావు కుటుంబ సభ్యులకు మరో రూ.5లక్షల చెక్కు అందజేశారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో కమ్యూనికేషన్ విభాగంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌వీ శ్రీనివాసరావుకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. వారి జీవితం నిండునూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

చెరుకుపల్లి: ప్రేమించాలని బాలికను వేధించడంతో పాటు ఆమె తండ్రిని గాయపరిచిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనీల్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి కనగాల గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో రాజవోలు గ్రామానికి చెందిన కుంచల భార్గవ్‌రెడ్డి వేధించాడు. తన అనుచరుడైన దొంతిబోయిన విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటికి వెళ్లాడు. బాలిక కుటుంబసభ్యులపై కత్తి, ఇనుప సుత్తితో దాడి చేశాడు. దీంతో బాధితురాలి తండ్రి గాయపడ్డాడు. ఈ కేసులో నిందితులను మంగళవారం ఉదయం గూడవల్లి రోడ్డులో పోలీసులు అరెస్టు చేశారు. వారిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

ఖజానాలో అవకతవకలపై విచారణ

చీరాల టౌన్: ఖజానాలో జరిగిన అవకతవకలపై అధికారులు విచారణ చేపట్టారు. పర్సంటేజీలు రాని, ప్రాధాన్యత లేని కుర్చీలను కేటాయించడంపై ఖజానా ఉద్యోగులు పెన్‌డౌన్ చేసి బిల్లులు మంజూరు చేయలేదు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించకుండా కమీషన్ల కోసం ఇబ్బందులకు గురిచేసిన ఖజానా ఉద్యోగులపై రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ ఎస్.మోహనరావు ఆదేశాలతో మంగళవారం చీరాల ఎస్టీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. చీరాల ఎస్టీవో కార్యాలయంలో 2021–24 సెప్టెంబర్ వరకు జరిగిన లావాదేవీలకు సంబంధించిన అన్ని రికార్డుల వివరాలు, ఆన్‌లైన్ సమాచారాన్ని పరిశీలించారు. అక్రమాలు, అవినీతికి పాల్పడి విధుల నుంచి సస్పెండ్ అయిన పూర్వ ఎస్టీవో భాగ్యలక్ష్మి, పూర్వ సీనియర్ అసిస్టెంట్ సుధీర, ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులు సుజాత, సోనియా, లక్ష్మి, రాజేశ్వరి, సుజాతలను పిలిపించారు. కొన్నేళ్లుగా ఈ ఉద్యోగులు చేసిన అన్ని బిల్లుల పాస్ వివరాల రికార్డులను పరిశీలించారు. వాటితో నివేదికలు తయారు చేశారు. డైరెక్టర్ ఆదేశాలతో విజయనగరం జిల్లా ఖజానా డీడీ, ఇద్దరు ఎస్టీవోలు, కర్నూలు, శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల ప్రధాన ఖజానా కార్యాలయాల డీడీలు, సీనియర్ ఎస్టీవోలు బృందాలుగా ఏర్పడ్డారు. మొత్తం ఆరుగురు అధికారుల విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి.



ధనలక్ష్మీ పాహిమాం

క్రోసూరు: శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా రూ.50 లక్షల కరెన్సీ నోట్లతో క్రోసూరులోని వాసవీ అమ్మవారిని మంగళవారం ధనలక్ష్మీగా అలంకరించారు. భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మార్కెట్‌లోకి నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ నూతన ఉత్పాదనలు



గ్లాంజ్ మందును ఆవిష్కరిస్తున్న నాట్కో కంపెనీ ప్రతినిధులు

కొరిటెపాడు(గుంటూరు): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ కంపెనీ అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించిన నూతన ఉత్పాదనలను మంగళవారం మార్కెట్లోకి విడుదల చేశారు. 'గ్లాంజ్', 'బోస్‌నెట్' శిలీంధ్ర నాశినులు (తెగుళ్ల మందులు), నాట్‌నెక్స్ కీటకనాశిని (పురుగుల మందు)లను స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ చెబియం మాట్లాడుతూ.. తమ విస్తృత శ్రేణి ఉత్పత్తుల్లో ఒకటైన గ్లాంజ్‌ను వివిధ పంటలలో సమర్థంగా వ్యాధి నియంత్రణకు రూపొందించామని తెలిపారు. పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన పద్ధతులను ప్రోత్సహిస్తూ ఉత్పాదకతను పెంపొందించాలనే తపనతో తాము వీటిని తెచ్చామని వివరించారు. రైతులను ఆదుకోవడమే తమ లక్ష్యం అని చెప్పారు. జాతీయ సేల్స్, మార్కెటింగ్ హెడ్ సార నర్సయ్య మాట్లాడుతూ.. గ్లాంజ్ మందు వరిలో మానిపండు, కాటుక, గోధుమ రంగు మచ్చ తెగుళ్ల నివారణకు ఉపయోగపడుతుందన్నారు. టమాటాలో ఆకుమాడు, మినుములో సెర్కోస్పెరా మచ్చ, మిరపలో బూడిద, ఆల్టనేరియా ఆకుమచ్చ, పక్షికన్ను, పత్తిలో ఆల్టనేరియా ఆకుమచ్చ తెగుళ్లను నివారిస్తుందని వివరించారు. బోస్‌నెట్ కూడా వివిధ పంటలలో బూడిద, మచ్చల తెగుళ్లను నివారిస్తుందన్నారు. నాట్‌నెక్స్ వివిధ పంటలలో కాయతొలుచు పురుగు, నల్లి (కింద ముడత) నివారణను ఉపకరిస్తుందని వివరించారు.

కార్యక్రమంలో కంపెనీ జడ్‌ఎం సౌత్ సేల్స్ అండ్ మార్కెటింగ్ రామిశెట్టి మాలకొండయ్య, ఏపీ సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగ ప్రతినిధి గోపు అజయ్‌రెడ్డి, ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు చెందిన నాట్కో డిస్ట్రిబ్యూటర్లు, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు దొంగల ముఠా అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ సుబ్బానాయుడు

చిలకలూరిపేట: మోసాలు, దొంగతనాలు, దోపిడీలకు పాల్పడే ఐదుగురు దొంగ ముఠాను రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. మార్టూరు మండలం నాగరాజుపల్లి తండాకు చెందిన బాణావతు రాంబాబునాయక్, తన మామయ్య రామావత్ బాబునాయక్‌తో కలసి సెప్టెంబర్ 28వ తేదీన చిలకలూరిపేట గొర్రెల మండీలో తనకు సంబంధించిన 16 పొట్టేళ్లు అమ్మగా రూ.1.15 లక్షలు వచ్చాయి. అవి జేబులో పెట్టుకొని తిరిగి తమ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చారు.

ఈ నేపథ్యంలో వారిని ఎక్కడికి వెళ్లాలంటూ ఆటోలో వచ్చిన ముఠా సభ్యులు ఆటో ఎక్కించుకున్నారు. దారిలో వారిలో వారు ఆడుతున్నట్లు మూడు బిళ్లలాట ఆడేలా చేసి వారి వద్ద నుంచి రూ.17,800 లాక్కొని రామచంద్రాపురం గ్రామ పరిధిలోని మంగళపాలెం డొంక వద్ద ఆటోలో నుంచి తోసేసి పారిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులు నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన బండారు ఏడుకొండలు, శివరాత్రి నాగేంద్రబాబు, జెట్టిపాటి నాగరాజు, శివరాత్రి కొండలు, జెట్టిపాటి శ్రీనులను చిలకలూరిపేట మండలం కావూరు వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.16వేలు నగదు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

వీరిపై పలు దోపిడీ, దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: బీ ఫార్మసీ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట పోలీసు స్టేషన్ సీఐ ఎం.వీరయ్య ఈ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. వారి కథనం మేరకు.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఓ విద్యార్థిని గుంటూరు సమీపంలోని ఓ కళాశాలలో బీ ఫార్మసీ చదువుతున్నారు. ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున స్నేహితుడితో అతడి ద్విచక్ర వాహనంపై ఆర్టీసీ బస్టాండ్ వద్దకు కాఫీ తాగేందుకు వెళ్లారు. తిరిగి తన రూము వద్దకు అతడు తీసుకెళుతున్న సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి నంబరు ప్లేట్ లేని బైకుపై వచ్చి పోలీసునంటూ భయపెట్టాడు. అనంతరం ఆ యువతిని ఎక్కించుకుని ఆమె స్నేహితుడిని తన వెనుక రావాలని పేర్కొన్నాడు.

బస్టాండ్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాలతోపాటు లాలాపేట పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లాడు. తాను చెప్పినట్లు వినకపోతే స్టేషన్ లోపలికి తీసుకెళతానని భయపెట్టాడు. వారు భయపడటంతో రూము వద్దకు తీసుకెళ్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో కొత్తపేట వద్ద స్నేహితుడి బైక్‌లో ఇంధనం అయిపోయింది.

విద్యార్థినిని ఆ దుండగుడు బుచ్చయ్య తోటలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రెండు అంతస్తుల బిల్డింగ్ వరండాలోకి తీసుకెళ్లి కొట్టి బెదిరించాడు. ఆపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత ఆమెను రూము వద్ద వదిలి వెళ్లిపోయాడు. దీనిపై స్నేహితుడి సాయంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన పోతినేని గోపి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మంగళవారం న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పలు చోరీ కేసుల్లో అతడు ఇప్పటికే నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

అతడిని అరెస్టు చేసి, ఓ ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఎస్ఐ డి.రమేష్, ఏఎస్ఐ ఆంథోని, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, బిక్షం, కోటేశ్వరరావు, పోతురాజు, హోంగార్డు షరీఫ్‌లను డీఎస్పీ అజీజ్ అభినందించారు.

వీఆర్‌ఓ కథ సుఖాంతం

- ఇంటికి చేరుకున్న నార్నెపాడు వీఆర్వో
- ఆర్థిక ఇబ్బందులతోనే ఇంటి నుంచి వెళ్లినట్లు అంగీకారం



వీఆర్వోతో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీ ప్రసాదు, ఎస్సై సోమేశ్వరరావు, తల్లిదండ్రులు

ముప్పాళ్ల: కనిపించకుండా పోయిన వీఆర్వో కథ ఎట్టకేలకు సుఖాంతమైంది. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో హాజరు కావటంతో ఉత్కంఠగా సాగిన విచారణ పూర్తయింది. ఈ నెల 2వ తేదీన నార్నెపాడు గ్రామ సచివాలయంలో విధులకు హాజరైన వీఆర్వో ఎస్.మల్లిఖార్జునరావు సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడంటూ తల్లి నాగేంద్రమ్మ ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేర విచారణ చేపట్టిన పోలీసులు గ్రామంలోని సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ వద్ద సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి వెతుకులాట చేపట్టారు. విచారణ జరుపుతున్న సమయంలోనే ఈ నెల 6న రెవెన్యూ శాఖలోని సహచరులకు ఫోన్ చేసి తమిళనాడులో ఉన్నట్లుగా చెప్పటంతో పోలీసులు, రెవెన్యూ వర్గాలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో విచారణ ముమ్మరం చేశారు. మంగళవారం ఉదయం ముప్పాళ్ళకు చేరుకున్న వీఆర్వో మల్లిఖార్జునరావు ఆర్థిక ఇబ్బందులతోనే ఇంటి నుంచి వెళ్ళిపోయానని, సూసైడ్ నోట్ గతంలో రాసుకున్నానని వీఆర్వో మల్లిఖార్జునరావు పోలీసులు ముందు అంగీకరించాడు. మనసు చికాకుగా ఉండటంతో దేవాలయాల సందర్శనకు వెళ్లానని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని వెల్లడించారు.

వీఆర్వో మల్లిఖార్జునరావును ఎస్సై వి.సోమేశ్వరరావు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, తల్లిదండ్రుల సమక్షంలో అప్పగించారు. వీఆర్వో మల్లిఖార్జునరావు ఇంటికి చేరుకోవటంతో కుటుంబసభ్యులు, రెవెన్యూ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.